క్లుప్తంగా

ఘనంగా మహా కుంభాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు

శ్రీరంగరాజపురం: శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ ఆలయ మహా కుంభాభిషేకం మంగుంట పంచాయతీ దిగువమంగుంట గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మహా కుంభాభిషేకానికి బెంగళూరు చెందిన యువకులు పెద్దఎత్తున హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేద పండితుల వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని గర్భగుడిలో చిత్రపటాన్ని ప్రతిష్టించారు. అనంతరం ఆలయ సిబ్బంది భక్తులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేపట్టి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వాహనం బోల్తా పడి..



బోల్తా పడిన టాటాఏస్ వాహనం

శ్రీరంగరాజపురం: వాహనం బోల్తా పడి ముగ్గురు గాయపడిన ఘటన మండలంలోని మెదవాడ ఎస్టీ కాలనీ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బంగారుపాళ్యం నుంచి పళ్లిపట్టుకు టాటాఏస్ వాహనంలో సిమెంటు, బండ రాయిని తరలిస్తున్నారు. అయితే మెదవాడ ఎస్టీ కాలనీ చిత్తూరు పుత్తూరు జాతీయ రహదారి వద్ద వాహనం టైర్ పంక్చర్ కావడంతో బోల్తాపడింది. ఇందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలు కావడంతో క్షేమంగా బయటపడ్డారు. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రభుత్వ అధికారులు ప్రమాదాల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ద్విచక్ర వాహనదారులకు జరిమానా



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ సురేంద్రనాయుడు

పుత్తూరు: పట్టణంలో ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో సరైన పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలకు రూ.10,300 జరిమానా విధించినట్లు సీఐ కేబీ సురేంద్రనాయుడు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక ఆర్టీసీ కాలనీ, బీడీ కాలనీల్లో కార్డెన్ సర్చ్ నిర్వహించామన్నారు. అనుమానాస్పద వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో పుత్తూరు రూరల్ సీఐ రవీంద్ర, ఎస్ఐలు ఓబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుచ్చిపై సూర్యనారాయణుడి విహారం



తిరుచ్చిపై విహరిస్తున్న సూర్యనారాయణ స్వామి

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతి అమ్మవారి అనుబంధ ఆలయంలో కొలువైన సూర్యనారాయణస్వామి ఆదివారం తిరుచ్చిపై కొలువై నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు. స్వామివారి జన్మనక్షత్రం హస్త నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 4.30 గంటలకు సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చారు. అనంతరం నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు.

శ్రీరామ విశ్వరూప దర్శనం

పాకాల : మండలంలోని దామలచెరువు సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామ విశ్వరూప దర్శనం కల్పించారు. స్వామి, అమ్మవార్లను సుందరగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయానికి భక్తుడైన ఆంజనేయుడు సీతారామ, లక్ష్మణులకు ఆహారంగా మామిడి ఫలాలను అందించిన దివ్య క్షేత్రంగా ప్రసిద్ధి. సూర్య జయంతి రోజున ఈ ఆలయంలో శ్రీరాముల వారి గర్భాలయంలోకి సూర్య కిరణాలు ప్రవేశించాయి. మంచు తెరలు పూర్తిగా తొలగినందున మాఘ పౌర్ణమి తర్వాత నాలుగో రోజున సంపూర్ణ సూర్య కిరణాభిషేక సేవలో భక్తులకు దామలచెరువు శ్రీరాముల వారు విశ్వరూప దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రద్ధ ట్రస్ట్ సభ్యులు రెడ్డెప్పరెడ్డి, రఘునాథ నాయుడు, చక్రపాణి, సురేంద్ర, ప్రసాద్, బాబు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



తమిళనాడులో వరి గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్లలో తీసుకొస్తున్న రైతులు

గ్రాసం కొరత..

తప్పని వెత



మండలం	పాడిపశువులు	మేకలు	గొర్రెలు
గంగాధరనెల్లూరు	19000	2940	4900
శ్రీరంగరాజపురం	9800	2900	2940
వెదురుకుప్పం	18500	2950	3500
కార్వేటినగరం	8900	1900	2950
పెనుమూరు	13000	3800	3900
పాలసముద్రం	7500	2850	3900

వేసవి కాలంలో పాడి పశువులను ఎలా పోషించాలని పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. గొర్రెలకు మేత దొరక్క పరిస్థితి దయనీయంగా మారింది. ఎండలకు భూములు బీడుబారాయి. పచ్చగడ్డి జాడ లేకుండా పోయింది. నీటి ఆధారం ఉన్న రైతులు పశుగ్రాసాన్ని పండించుకోవడం మినహా మరే ప్రత్యామ్నాయం లేకపోవడమే ఈ కొరతకు కారణమైంది. ఇప్పటికే ఒక్కో రైతు పశువులను సంరక్షించలేక విక్రయిస్తున్నారు. అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు.

- వేసవికి ముందే పాడి రైతులకు తప్పని ఇక్కట్లు
- తమిళనాడు నుంచి గ్రాసం ఎగుమతి
- రూ.20 వేలు పలుకుతున్న ట్రాక్టర్ వరి గడ్డి
- తగ్గిన పాల దిగుబడి
- పోషణ భారమై పశు, మూగజీవాలను అమ్మేసుకుంటున్న రైతులు



వెంగళరాజుకుప్పం సమీపంలో మైదానంలో మేస్తున్న పాడిపశువులు

పాలసముద్రం: గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఎక్కువశాతం మంది ప్రజలు పాడిపశువుల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే వేసవి రాక మునుపే గ్రామాల్లో గ్రాసం కష్టాలు మొదలయ్యాయి. అవసరమైన గడ్డి దొరక్కపోవడంతో కొందరు విధిలేని పరిస్థితుల్లో పశువులు, మేకలు, గొర్రెలను పోషించలేక తమిళనాడు తిరుత్తణి, వేలూరు, పుంగనూరు సంతల్లో అందిన కాడికి అమ్ముకుంటున్నారు. పక్షం రోజుల్లో వందల సంఖ్యలో పాడిపశువులు, మేకలు, గొర్రెలను విక్రయించినట్లు తెలుస్తోంది.

తమిళనాడు నుంచి కొనుక్కుని..

పాడి పశువులను సంరక్షించే రైతులు ఈ సీజన్‌లో గడ్డి కొనుగోలు చేయాల్సిందే. ట్రాక్టర్ ఎండుగడ్డి లోడు రూ.20 వేల నుంచి రూ.25 వేలు వరకు పలుకుతోంది.

దీంతో ఈ వేసవిలో పశువుల సంరక్షణ రైతులకు తలకుమించిన భారంగా తయారైంది. ఈ పరిస్థితుల్లో రోజూ మినీ ఆటోలో తమిళనాడు నుంచి పచ్చిగడ్డి తీసుకొస్తున్నారు. పచ్చిగడ్డి మోపు రూ.180 నుంచి రూ.250 విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశుగ్రాసం కొరతను కొంతవరకైనా తీర్చాలని పాడి రైతులు కోరుతున్నారు.

చోద్యం చూస్తున్న ప్రభుత్వం..

వర్షాభావం కారణంగా పంటలు లేక, గ్రాసం లేక రైతులు వేసవికి ముందే అల్లాడుతున్నా ప్రభుత్వం ఏమాత్రం సహాయక చర్యలు చేపట్టడం లేదు. పక్కన ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో జనవరి మాసం నుంచి మూడు నెలల పాటు గ్రామ పంచాయతీల వారీగా గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేసి పశువులకు గ్రాసం కొరత తీరుస్తున్నారు. ఇక్కడ మాత్రం టీడీపీ ప్రభుత్వం ఎన్నడూ కూడా పశుగ్రాసం కేంద్రాలను ఏర్పాటు చేసి గడ్డిని అందించిన దాఖలాలు లేవని రైతులు విమర్శిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపుతాం



మండల పరిధిలోని పాడిరైతుల అవసరాన్ని బట్టి సబ్సిడీ పశుగ్రాసం మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. వేసవికి ముందే పశుగ్రాసం కొరత వస్తోందని జిల్లా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పాడి రైతుల జాబితాను అందిస్తాం.

– యశశ్వి, పాలసముద్రం, పశువైద్యాధికారి

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి



వరిగడ్డి దొరక్కపోవడంతో డిమాండ్ పెరిగింది. యంత్రాలతో కోయించిన వరిగడ్డి ముక్కలు అవుతుండడంతో పశువులకు ఉపయోగపడడం లేదు. పశువులకు అది పనికి రాదని రైతులు చెబుతున్నారు. చాలా మంది రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చేస్తున్నారు. ఎండలు ఎక్కువ కావడంతో యంత్రాలతో కోసిన వరిగడ్డికి గిరాకీ పెరిగి ట్రాక్టర్ రూ.20 వేలు పలుకుతోంది.

– కే.మనోహర్, పాడిరైతు, వీర్లగుడి దళితవాడ

ప్రభుత్వం ఉచితంగా అందించాలి



తమిళనాడు, కర్ణాటక తరహాలో ఇక్కడ కూడా ప్రభుత్వం గడ్డి కేంద్రాలు ఏర్పాటు చేసి గ్రాసం కొరత తీర్చాలి. రాను రాను ఎండల తీవ్ర ఎక్కువ కావడంతో పొలం గట్లపై, బీడు భూముల్లో ఉన్న పచ్చగడ్డి ఎండిపోతోంది. ప్రభుత్వం స్పందించి పాడిరైతులను ఆదుకోవాలి.

– కే.రవి, కృష్ణజమ్మపురం గ్రామ నివాసి

తగ్గుతున్న పాల దిగుబడి



పాడిపశువులకు ఈ ఏడాది ప్రారంభంలోనే పచ్చిగడ్డి కరువైంది. పశువులకు కాస్త మేసేందుకు గడ్డి లేకపోవడంతో పాల దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే రోజుకు 4 నుంచి 6 లీటర్ల వరకు పాలు ఇచ్చే పాడిపశువులు సైతం దాణా, పచ్చిగడ్డి లేకపోవడంతో కేవలం మూడు లీటర్లు మాత్రమే ఇస్తున్నాయి.

– మంజుల, ఏట్టుకూరిపల్లె.

18న ఉచిత మెగా వైద్యశిబిరం

పెనుమూరు(కార్వేటినగరం): పేద ప్రజల కోసం గ్రామాల్లో నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీ మహా సముద్రం జ్ఞానేంద్ర రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడు తూ రామకృష్ణారెడ్డి చారిటబుల్ ఫౌండేషన్ పెనుమూరు వారి ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ చిత్తూరు, అపోలో హాస్పిటల్ డాక్టర్ల సహాయంతో ఈ నెల 18వ తేదీ మంగళవారం మండల పరిధిలోని పులిగుండు వద్ద శిబిరం ఏర్పాటు చేశారన్నారు. ఉదయం 9 నుంచి 5 గంటల వరకు శిబిరంలో వైద్యసేవలు అందిస్తారన్నారు. అదేవిధంగా గుంటిపల్లికి చెందిన దినేష్‌రెడ్డి చొరవతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారి సౌజన్యంతో రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

భార్గవి మృతదేహానికి ఆర్కే సెల్వమణి నివాళి



సుబ్రమణ్యంను ఓదార్చుతున్న ఆర్కే సెల్వమణి

విజయపురం : మండలంలోని ఇల్లత్తూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సుబ్రమణ్యం కుమార్తె భార్గవి (35) మృతదేహానికి మాజీ మంత్రి ఆర్కే రోజా భర్త సెల్వమణి పూలమాల వేసి నివాళులర్పించారు. భార్గవి జర్మనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ భర్త, ఇద్దరు పిల్లలతో అక్కడే ఉంటున్నారు. ఈ నెల 5న జ్వరం రావడంతో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని ఆదివారం ఉదయం తమిళనాడులోని చెంగల్‌పట్టులోని స్వగృహానికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఆర్కే రోజా భర్త సెల్వమణి, విజయపురం మండలానికి చెందిన నాయకులతోపాటు ఇల్లత్తూరు సర్పంచ్ దీపిక, ఎంపీటీసీ సరళ, బాబురాజు, శ్రీహరి, నాగేంద్ర, గోపీనాథ్, ఏలుమలై, రమేష్ అక్కడికి చేరుకున్నారు. ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా ఫోన్‌లో సుబ్రమణ్యం కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు.

ఈ సారైనా వేలం పాటలు జరిగేనా?

నగరి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభానికి నోచుకోలేదు. మూడేళ్ల నుంచి అనివార్య కారణాలతో వేలం పాటలు వాయిదా వేస్తూనే ఉన్నారు. దీంతో ప్రజా ధనం వృథా అవుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండడంతో నెల రోజుల్లో వేలం పాటలు నిర్వహిస్తామని శాప్ అధికారులు ప్రకటించారు. ఈ సారైనా వేలం పాటలు జరుగుతాయో లేదోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

- వేలంపాట జరిగేనా?
- కట్టిన నాటి నుంచి తెరచుకోని స్పోర్ట్స్ కాంప్లెక్స్
- పలుమార్లు వేలం వాయిదా
- ఎదురుచూస్తున్న వ్యాపారులు



మూసి ఉన్న క్రీడా కాంప్లెక్స్

నగరి : నగరి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో రూ.2.10 కోట్ల వ్యయంతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కోసమని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను మున్సిపాలిటీ నిర్మించింది. దీన్ని 2018లో ప్రారంభించారు. ఇందులో 12 అడుగుల వెడల్పు, 16 అడుగుల పొడవుతో 6 గదులు నిర్మించారు. వాటిని బహిరంగ వేలం ద్వారా వ్యాపారులకు అద్దెకు కేటాయించనున్నట్టు అప్పట్లో అధికారులు ప్రకటించారు. ఏడేళ్లుగా వేలం పాటలు వాయిదా పడుతూనే ఉన్నాయి. 2019లో ఎస్సీ, బీసీ అంటూ వర్గాల వారీగా కేటాయించి వేలం నిర్వహించగా పలువురు పాల్గొన్నారు. కొందరు రూ.10 వేలు చొప్పున అడ్వాన్సు కూడా చెల్లించారు. వేలం వాయిదా పడడంతో డబ్బులు చెల్లించిన వారికి ఆ మొత్తాన్ని వాపసు చేయలేదు. అప్పటి నుంచి ప్రతి ఏటా వేలం జరుగుతుందని ఎదురుచూసినా ఫలితం లేదు. 2023లో శాప్, రెవెన్యూ అధికారులు ఈ కాంప్లెక్స్‌ను అద్దెకు ఇవ్వడానికి ముందుకు వచ్చారు. విధి విధానాలు, అడ్వాన్సు, అద్దె అన్నీ నిర్ణయించారు. దుకాణాల ముందు అద్దెకు ఇవ్వబడును అంటూ ఫ్లెక్సీలు కూడా ఏర్పాటుచేశారు. రాజకీయ నాయకుల ప్రమేయంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఇలా పలుమార్లు వాయిదా పడుతున్న ఈ కాంప్లెక్స్ తలుపులు ఏడేళ్లుగా తెరుచుకోవడం లేదు. మరోవైపు క్రీడా భవన నిర్వహణకు, విద్యుత్ బిల్లులు చెల్లించడానికి డబ్బులు లేని పరిస్థితి ఉంది. ప్రస్తుత జాతీయ రహదారి వెడల్పులో రహదారిని ఆనుకుని వున్న కాంప్లెక్స్‌ను అద్దెకు ఇస్తే వచ్చే ఆదాయంతో క్రీడా ప్రాంగణ భవనం, కార్యాలయాల నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందని సీనియర్ క్రీడాకారులు తెలుపుతున్నారు. అధికారులు ముందుకు వచ్చి గండాలను అధిగమించి వేలం పాటలు నిర్వహించాలని కోరుతున్నారు. ప్రస్తుతం ప్రధాన రహదారిలో దుకాణాలు లేక స్వంత వ్యాపారాలు చేసుకోదలచిన యువకులు ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి ఈ దుకాణాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందంటున్నారు.



2023లో గదులు అద్దెకు ఇస్తామని ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ (ఫైల్)

నెలరోజుల్లో టెండర్లు నిర్వహిస్తాం



మూసి ఉన్న కాంప్లెక్స్‌ను అద్దెకు ఇవ్వడానికి జేసీ నుంచి అనుమతులు పొందాం. నెలరోజుల లోపు శాప్ ఆదేశాల మేరకు విధి విధానాలను రూపొందించి టెండర్లు నిర్వహిస్తాం. పారదర్శకంగా దుకాణాలను వేలంలో అందజేస్తాం. ప్రస్తుతం ఒక గదికి మాత్రమే విద్యుత్ కనెక్షన్ ఉంది. గదులు సరిచేసి అన్నింటికీ విద్యుత్ కనెక్షన్ ఇప్పిస్తాం.

– బాలాజీ, శాప్ సీనియర్ కోచ్, కాంప్లెక్స్ ఇన్‌చార్జి

నూర్పిడి యంత్రాలకు డిమాండ్



విజయపురంలో వరి నూర్పిడి చేస్తున్న యంత్రం

విజయపురం : మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. గత నెల కురిసిన భారీ వర్షాలతో పొలాల్లో తేమ ఎక్కువగా ఉండడంతో కూలీలు కోతలకు రావడంలేదు. దీనికి తోడు పైర్లు నేలవాలి పోవడంతో కోతకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో నూర్పిడి యంత్రాల కోసం రైతులు పరుగులు తీస్తున్నారు. కూలీలకు రోజుకు రూ.350 నుంచి రూ.400లు ఇస్తున్నారు. తమిళనాడు నుంచి మండలానికి చేరుకున్న వరి నూర్పిడి యంత్రాలకు డిమాండ్ పెరిగింది. ఎండి నేలపై పడిన వరిని నూర్పిడి చేయడానికి గంటకు రూ.2000, తేమ పొలంలో నూర్పిడి చేయడానికి రూ.3 వేల వరకు బాడుగ తీసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడి లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. 10–15 బస్తాలకు మించి ధాన్యం చేతికి రావడం లేదు. వాస్తవానికి ఎకరాకు 30–40 బస్తాలు దిగుబడి రావాల్సివుంది. అకాల వర్షంతో రైతులు తీవ్ర నష్టపోయారు. దీనికి తోడు యంత్రాలతో కోతలు చేయడంతో పశువులకు గ్రాసం కూడా దొరకడం లేదని రైతులు వాపోతున్నారు. ఒక వైపు అడవి పందులు, ఎలుకల బెడద, వీటికి తోడుగా అకాల వర్షాలతో దిగుబడులు లేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాం



పూర్వ ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

వెదురుకుప్పం : 40 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు అందరూ ఒకచోట కలవడం ఓ అద్భుతం అని పూర్వ విద్యార్థుల రిటైర్డు ఉపాధ్యాయులు అన్నారు. మండలంలోని వెదురుకుప్పం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1984–1985 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకం అని, నాడు తాము విద్యను బోధించిన విద్యార్థులు నేడు తహసీల్దారుగా, డాక్టర్లుగా, బిల్డర్లుగా, పారిశ్రామికవేత్తలుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ రంగాల్లో స్థిరపడి ఉన్నత స్థానాలకు ఎదగడం తమకు గర్వంగా ఉందన్నారు.

పది మందికి సహాయపడి మీరు ఎదిగిన తీరు నేటి యువతకు ఆదర్శంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నేర్పిన నైతిక విలువలు, చదువు, వారి ప్రేరణ తమ ఉన్నతస్థితికి ఎంతగానో ఉపయోగపడిందన్నారు. తాము ఈ స్థితికి రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను స్మరించుకుని సన్మానించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి, ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం జరిగిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తమిళనాడు రాష్ట్రం తిరుకలుకుండ్రంకు చెందిన నటేశా నృత్యాలయం కళాకారులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పుష్పాంజలి, సూర్య కౌత్వం, విషమకార కర్త, శ్రీమన్నారాయణ నమః తదితర పాటలకు నృత్యాలు ప్రదర్శించారు. వారిని శిల్పారామం ఏవో ఖాదర్‌వలి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

– తిరుపతి రూరల్

అ'పూర్వ' కలయిక

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవలు ఎనలేనివని రిటైర్డు ప్రధానోపాధ్యాయులు మార్కొండనాయుడు అన్నారు. ఆదివారం 1992–93 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ సొంత ఖర్చులతో పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ అప్పట్లో హెచ్‌ఎం మార్కొండనాయుడు అంటే తమకు భయం అని.. అందువల్లే తాము బాగా చదివేవాళ్లమన్నారు. చాలా మంది ఉన్నతస్థాయిలో ఉన్నారని కొనియాడారు. ముందుగా రిటైర్డు హెచ్‌ఎం మార్కొండనాయుడికి పాదపూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వేదపండితులు హోమపూజలు చేసి సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ప్రస్తుత హెచ్‌ఎం రఘుమండడి, సైన్స్ ఉపాధ్యాయుడు రమేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న పూర్వ విద్యార్థులు

స్వయం ఉపాధితో మహిళలు రాణించాలి

తిరుపతి కల్చరల్: చేతి వృత్తుల్లో నైపుణ్యాలు పెంపొందించుకుని మహిళలు రాణించాలని చేతన సోషల్ ట్రస్ట్ నిర్వాహకుడు సుబ్రమణేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్‌జీవోస్ కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం ట్రస్ట్ పదో వార్షికోత్సవం నిర్వహించారు. టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.